www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 డిసెంబర్ 2025
5
తిరుపతి



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఎస్‌పిడిసిఎల్ తిరుపతి ఆపరేషన్ ఈఈ గంగాధరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఫీడర్లు మరమ్మత్తు, ట్రీ కటింగ్ కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇస్కాన్ 11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వరదరాజ నగర్, సిరిపురం కాలనీ, యశోద నగర్, సిపిఎం ఆఫీస్, ప్రాంత వినియోగదారులు విద్యుత్తు అంతరాయానికి సహకరించాలని కోరారు.

ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ 'ఫ్లాష్ మాబ్'

ప్రజాశక్తి - క్యాంపస్

ఈనెల 12, 13, 14 తేదీల్లో తిరుపతి వేదికగా కచ్చపి ఆడిటోరియంలో జరగనున్న ఎస్ఎఫ్ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 25వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్వి యూనివర్శిటీలో శ్రీనివాస ఆడిటోరియం ఎదుట సోమవారం సాంస్కృతిక వేడుకలు (ఫ్లాష్ మాబ్) నిర్వహించారు. రాష్ట్ర వర్సిటీల కోకన్వీనర్ అశోక్‌కుమార్, ఎస్వియూ కార్యదర్శి వినోద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పోరాటాల్లోనే కాకుండా, విద్యార్థుల్లోని ప్రతిభను, సృజనాత్మకతను వెలికితీయడంలో నాయకులు ముందుంటారన్నారు. తిరుపతిలో 12వ తేదీ జరిగే ర్యాలీ, బహిరంగసభలను జయప్రదం చేయాలన్నారు. ఎస్వి ఆర్ట్స్ కళాశాల ఐన్‌స్టీన్ విగ్రహం నుంచి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ వరకూ డప్పు కళాకారులతో వేలాది మంది విద్యార్థులతో ప్రదర్శన ఉంటుందన్నారు. నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో ఉదయం 11 గంటలకు బహిరంగసభ ఉంటుందన్నారు. అఖిల భారత అధ్యక్షులు ఆదర్శ్ ఎం.సాజి, ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య, రాష్ట్ర కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, మాజీఅఖిల భారత అధ్యక్షులు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ జి.పల్లవి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి,



ఎస్వీయూలో ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ శ్రేణులు

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పిలుపు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అక్బర్, బి.రవి పాల్గొంటారని తెలిపారు. అదేరోజు సాయంత్రం కచ్చపి ఆడిటోరియంలో ప్రతినిధుల సభ ప్రారంభం అవుతుందన్నారు. రిటైర్డ్ మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ కె.చంద్రు, జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. గౌరవ అతిథులుగా ఎస్వీయూ రెక్టార్ సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఎం.భూపతినాయుడు, డిడి సాంఘిక సంక్షేమ శాఖ జె.విక్రం కుమార్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్. కుమార్, ఆర్ఐఒ రాజశేఖర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. 12 నుంచి 14వ తేదీ వరకు ప్రతినిధుల సభ జరగనుంది. భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించి,నూతన కమిటీ ఎన్నుకోనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు నరసన్న నాయకులు షేక్ష, మాతేశ్వరి, వాసు, శ్రీకాంత్, గీతాంజలి, తిప్పేసామి, విజయ్,శ్రీను నాయక్, మని, ప్రకాష్, ఆంజనేయులు, భాను తదితరులు పాల్గొన్నారు.



అరణియార్ పర్యాటక పనులను పరిశీలిస్తున్న తుడా ఛైర్మన్, ఎంఎల్ఎ

అరణియార్ పర్యాటక అభివృద్ధికి అదనపు నిధులివ్వాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు

అరణియార్ పర్యాటక అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలని తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డిని ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలం విజ్ఞప్తి చేశారు. సోమవారం పర్యాటక అభివృద్ధి పనులను ఛైర్మన్, ఎంఎల్ఎ పరిశీలించారు. అరణియార్ పర్యాటక అభివృద్ధి పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయని, గతంలో కేటాయించిన నిధులు చాలడం లేదని, అదనపు నిధులు కేటాయించాలని ఎంఎల్ఎ విజ్ఞప్తి చేశారు. ఇరిగేషన్ ఈఈ మాట్లాడుతూ తుడా గతంలో పర్యాటక అభివృద్ధికి 2 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. గతంలో కేటాయించిన నిధులు చాలడం లేదని, అదనంగా 60 లక్షలు కేటాయించి సహకరించాలని కోరారు. మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి కోరిక మేరకు పిచ్చాటూరు ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోస్టాఫీసు వరకూ డ్రైనేజీ నిర్మాణానికి స్థల పరిశీలన చేసి డ్రైనేజీ కాల్వ నిర్మించుటకు నిధులను తుడ అధికారులతో మాట్లాడి వెంటనే సిఫార్సు చేస్తామని ఛైర్మన్ తెలిపారు. సత్యవేడును తుడా సంస్థ దత్తత తీసుకుని సమగ్ర అభివృద్ధి చేపట్టాలని తుడా ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ

మండలంలోని భవానీశంకరపురం గ్రామంలో క్వారీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సర్పంచ్ రాజయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూలోని సర్వే నెంబరు 28పి నందు సుమారు 23 ఎకరాలను దళితులు గత కొంత కాలంగా వరి పైరు, ఇతర మొక్కలను పెంచుకుని సాగు చేస్తున్నామని తెలిపారు. అయితే శ్రీకాళహస్తి వాసి దగ్గర రెవెన్యూ అధికారులు పెద్ద మొత్తంతో డబ్బులు తీసుకుని క్వారీకి ఎన్వోసి ఇవ్వడం వలన క్వారీ అనుమతులు తెచ్చుకున్నారని తెలిపారు. దళితులు సాగులో ఉన్న భూములను క్వారీకి ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. క్వారీ అనుమతులు రద్దు చేసే వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి దళితులు వినతిపత్రం అంజేశారు. తహశీల్దార్ స్పందిస్తూ పరిశీలించి దళితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దళితులకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

రుయా కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రుయా ఆసుపత్రిలో పనిచేస్తున్న నాలుగవ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని గత కొన్నేళ్ల నుండి సమస్యలు తీవ్రంగా ఉన్నా, పదేపదే యాజమాన్యానికి తెలియజేస్తున్నా పరిష్కరించని నేపథ్యంలో సోమవారం సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసును సిఐటియు ఆధ్వర్యంలో అందజేశారు. సిఐటియు ఉపాధ్యక్షులు కే వేణుగోపాల్, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి ముని చంద్ర, ఏ నరసింహులు, కార్యదర్శి బి గురవయ్య మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలలోని అతిపెద్ద ఆసుపత్రి దాదాపు 1500 బెడ్ల సామర్థ్యం కలిగినటువంటి ఆసుపత్రిలో ఎంఎన్ఓ లు, ఎఫ్ ఎన్ వో లు దోబీలు, వాటర్ మెన్లు, బార్బర్లు, స్ట్రెక్చర్ బేరర్లు, గార్డెన్లు ఇలా మొత్తం 750 మంది పైచిలుకు కార్మికులు పనిచేయాల్సిన చోట కేవలం 83 మంది మాత్రమే పనిచేస్తున్నారన్నారు. విపరీతమైనటువంటి పని భారాన్ని మోపుతున్నారన్నారు. సుబ్రహ్మణ్యం, శివకుమార్, హరికుమార్, రమేష్ పాల్గొన్నారు.

19 నుంచి తిరుపతిలో సిఐటియు 'శ్రామిక ఉత్సవ్'

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో తిరుపతిలో శ్రామిక ఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాలు డిసెంబర్ 19 నుండి 21వ తేదీ వరకు నిర్వహించే బ్రోచర్‌ను సోమవారం యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. శ్రామిక్ ఉత్సవ్ నిర్వహణ కమిటీ అధ్యక్షులు నడ్డి నారాయణ మాట్లాడుతూ సాంస్కృతిక కళలను పెంపొందించే క్రమంలో భాగంగా తిరుపతిలో డిసెంబర్ 19 నుండి 21 వరకు వినాయక సాగర్‌లో సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎటువంటి రుసుము చెల్లించకుండా ఉచితంగా తమ కళలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ శ్రామిక ఉత్సవ్ సాంస్కృతిక కార్యక్రమాల్లో కార్మికపాటలు, అభ్యుదయ పాటలు, దేశభక్తి గీతాలు, నాటికలు, జానపద కళలు, చెక్కభజన, కోలాటం, మిమిక్రీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాల్గొనదలచిన వారు సంప్రదించాల్సిన నంబర్లు 8919553690, 9398000686. ఈ కార్యక్రమంలో శ్రామిక ఉత్సవ్ నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎం నాగార్జున, కమిటీ సభ్యులు నెల్లూరు విజయలక్ష్మి, డాక్టర్ కడివేటి మునిరత్నం, డాక్టర్ కమతం రెడ్డి ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్. జయచంద్ర, టి. సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రేమ జంటకు రక్షణ కల్పించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్పుత్తూరు మండలం కళ్యాణపురం గ్రామం ఎస్టి కాలనీకి చెందిన సుజాత అంజయ్యల రెండవ కుమారుడు టి అశోక్ (26) నగిరి వాస్తవ్యులు కే వేణుగోపాల్, కే రేఖల మొదటి కుమార్తె కే సాయి జ్యోతి (21) ఇరువురూ ఎనిమిది సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. చదువులు పూర్తి చేసుకొని వివాహం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరగా కులాలు వేరైనందున అంగీకరించలేదు. అమ్మాయిని కొట్టి వేరే వాళ్లతో పెళ్లి నిశ్చయించడంతో సోమవారం ఉదయం వడమాలపేట బైపాస్ నందు గల చెంచమ్మ గుడి దగ్గర 10.30 గంటలకు వివాహం చేసుకొని అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీని ఆశ్రయించారు. వీరికి ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, నగర కార్యదర్శి ఎం.జయంతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ పవిత్ర, కెవిపిఎస్ నాయకులు ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

'మండే' అర్జీలతో కలెక్టరేట్‌కు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి జిల్లా అధికారులు సకాలంలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. పిజిఆర్ఎస్ అర్జీలపై అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవిన్యూ 184, పంచాయతీరాజ్ 22, సెర్ప్ 15, పోలీస్ 15, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 9 అర్జీలు వచ్చినట్టు అధికారులు ప్రకటించారు.

పట్టాలు మంజూరు చేయించండి : రాజశేఖర్, సిపిఎం, తారకరామనగర్



రేణిగుంట మండలం తారకరామా నగర్ వద్ద ఉన్న సుందరయ్య కాలనీలో నివాసమున్న పేద ప్రజలకు పట్టాలు, విద్యుత్ మీటర్లను మంజూరు చేయించాలి. సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చాము. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయాలి.

పిల్లలకు ఆట స్థలాన్ని కేటాయించండి : సెల్వరాజ్, సిఐటియు, రేణిగుంట




రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటస్థలం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటస్థలంకు గతంలో కేటాయించిన భూమి కబ్జాకు గురైంది. 460 మందికి పైగా ఉన్న విద్యార్థులు ఉంటే ఆటస్థలం లేకుండా పోవడంతో క్రీడలకు నోచుకోని పరిస్థితి ఉంది. ఉన్న కొద్దిపాటి స్థలాన్ని కూడా రాస్ సంస్థ వారు తమ ఆధీనంలోకి తీసుకోవడం దారుణమని, విద్యార్థులకు ఆటస్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

ఫిట్నెస్ సర్టిఫికెట్లు మ్యానువల్ గా ఇవ్వండి....

నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించి రవాణా శాఖ జారీచేసే ఫిట్నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే బంగారుపాల్యం, నెల్లూరు జిల్లాలకు వెళ్ళమంటున్నారు. ఇప్పటికే పెరిగిన డీజిల్ ధరలు, సరైన బాడుగలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రవాణా శాఖ ఎఫ్సీల జారీ కోసం ఏర్పాటు చేయనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ పూర్తి అయ్యేవరకు అపరాధ రుసుములు వేయకుండా, తమ వాహనాలకు మ్యానువల్ గా సర్టిఫికెట్లు ఇవ్వాలని ట్రావెల్స్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

పేరూరు చెరువుకు మురుగునీరు రాకుండా : మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఎంపిపి, తిరుపతి రూరల్



తిరుపతి పట్టణానికి సమీపంలోని గ్రామాలకు భూగర్భ నీటి మట్టాన్ని పెంచే పేరూరు చెరువుకు చేరుతున్న మురుగునీరు రానీయకుండా చర్యలు తీసుకోండి. పేరూరు చెరువుకు ఆనుకొని 500 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. పెరుమాళ్ళపల్లి, వెంకటపతి నగర్, జూ పార్కు ప్రాంతంలోని అపార్ట్మెంట్లు, చెర్లోపల్లి హ్యాబిటేషన్ల నుండి వకుళమాత ఆలయం వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి నుండి మురుగునీరు నేరుగా చెరువులోకి చేరుతోంది.

నకిలీ విత్తనాలు అమ్మి మమ్మల్ని ముంచాయి కునాటి నాగరాజు, రైతు



సూళ్ళూరుపేట ప్రాంతంలో ఎక్కువగా సాగు చేసుకునే బిపిటి 2782 వరి విత్తనాలకు బదులుగా బాగా పండుతాయని స్థానిక పూజిత అగ్రో సర్వీసెస్ వారి నుండి విత్తనాలు కొని నారు పోసి నాట్లు నాటాము. 25 రోజులు గడిచిన తర్వాత నారులో తేడా రావడంతో నష్టపోయామని గ్రహించి నకిలీ విత్తనాలు అమ్మిన పూజిత అగ్ర సర్వీసెస్ వారిని నిలదీయగా వారి నుండి ఎటువంటి సమాధానం రాలేదు. పైగా అన్నపూర్ణ కంపెనీ నంద్యాల వారు ఇచ్చిన వాటిని మీకు ఇచ్చారని బదులు ఇచ్చి తప్పించుకుంటున్నారు. సూళ్లూరుపేట పరిసర ప్రాంతాలలోని 1300 ఎకరాల్లో పంట వేసిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. అలానే నకిలీ విత్తనాలను సరఫరా చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందించారు.

తుపాన్లతో నష్టపోయాం ఆదుకోండి : ముద్దిశెట్టి శ్రీనివాసులు, జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి



తిరుపతి జిల్లా పరిధిలో చేనేత మగ్గాలను జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న మేము తుఫాన్లతో నష్టపోయాం. ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటే గాని నష్టాల నుండి బయటపడలేము. మగ్గాలు, ముడి సరుకులు వర్షపు నీటితో తడిచిపోయాయి. ఆర్థిక సహాయం చేసి ఆదుకోండి.

పట్టాలు ఇచ్చి ఆదుకోండి : వెంకటాచలం, నీడ్ ఎన్జీవో కార్యదర్శి, తిరుపతి రూరల్

రెండు తరాలుగా చంద్రగిరి నియోజకవర్గంలోని సి మల్లవరం యానాది కాలనీలో 30 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అధికారుల చుట్టూ తిరిగితే విద్యుత్ సౌకర్యం, తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. 2016 నుండి ఇంటి పట్టాల కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. పట్టాలిచ్చి ఆదుకోండి.

- తిరుపతి టౌన్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి పాల్గొన్నారు.

- తిరుపతి సిటీలో.. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంలో అలసత్వం దరిచేరకూడదని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి సంస్థ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఎపిఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం "డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 70 వినతులు అందినట్లు తెలిపారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను సిఎండి దష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్(ప్రాజెక్ట్స్ అండ్ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ఆర్డి) కె. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామమోహన్ రావు పాల్గొన్నారు.

శ్రీసిటీ హైటెక్ పిఎస్ నూతన ఎస్ఐగా ప్రియాంక

ప్రజాశక్తి - వరదయ్యపాలెం



శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐ గా ప్రియాంక సోమవారం భాద్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా తిరుపతి ఎస్.బి నుంచి ఇక్కడకు విచ్చేశారు. ఎస్ఐ ప్రియాంక గతంలో నాగలాపురం, నారాయనవనం మండలాల్లో విధులును నిర్వహించి ఉన్నారు. అలాగే బుచ్చినాయుడు కండ్రిగ ఎస్.ఐ సుధీర్ కుమార్ రెడ్డిని, చంద్రగిరి పిఎస్ నుండి చిత్ర తరుణ్ ను ఉన్నతాధికారులు ఇక్కడకు బదిలీ చేశారు. దీంతో శ్రీసిటీ హైటెక్ పోలీస్టేషన్ లో ముగ్గురు ఎస్ఐ లు నూతనంగా విధులును నిర్వర్తించనున్నారు. ప్రియాంక మాట్లాడుతూ శ్రీసిటీ సెజ్ గ్రామీణ ప్రాంత ప్రజలకు, మహిళా కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఏవైనా భద్రతాపర్యమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

శ్రీసిటీలో వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీపై సదస్సు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల రీసైక్లింగ్ పాలసీ (4.0) 2025-2030 పై ఉన్నతస్థాయి సమావేశం సోమవారం శ్రీసిటీలో నిర్వహించారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ శాఖ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు పాల్గొన్నారు. కాలుష్య నియంత్రణతో పాటు చెత్త నుండి సంపద స ష్టించాలన్న రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలపై ఇందులో విపులంగా చర్చించారు. డాక్టర్ పి.క్రిష్ణయ్యకు శ్రీసిటీ ప్రెసిడెంట్ సతీష్ కామన్ స్వాగతం పలికారు. శ్రీసిటీలో అమలు చేస్తున్న రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ విధానాల ప్రాధాన్యతను, నిబద్ధతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసిబి సభ్యుడు నాగేశ్వర రాజు, సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ముని ప్రసాద్‌తో పాటు ఆ శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ ఘటనపై పార్లమెంటులో ఎంపీ వాయిదా తీర్మానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటుచేసుకున్న లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిల్, డ్రగ్స్ ఘటనలను కేంద్రం ద ష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో అడ్జర్న్‌మెంట్ మోషన్ నోటీసు ఇచ్చారు. బీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థినిని, అదే వర్సిటీలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగికంగా వేధించడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలను అడ్డుపెట్టుకుని బెదిరించడం అత్యంత హేయమని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాల్సిన గురువులే ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడటం తిరుపతి ప్రతిష్టకు దెబ్బతీస్తోందని ఎంపీ పేర్కొన్నారు. దీంతో పాటు వర్సిటీ హాస్టల్ తనిఖీల్లో 20 గంజాయి ప్యాకెట్లు బయటపడటం, క్యాంపస్ భద్రతా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఎంపీ గురుమూర్తి అన్నారు.క్యాంపస్ భద్రతను బలోపేతం చేసి డ్రగ్-ఫ్రీ వాతావరణాన్ని ఏర్పరచాలని ఎంపీ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు.

సైబర్ నేరాలు



ప్రజాశక్తి -తిరుపతి సిటీ

సైబర్ నేరాలు కొత్త పంథాలో జరుగుతున్నాయి. చదువుకున్నవారు సైతం సైబర్ మోసాల బారిన పడుతున్నారు. సైబర్ క్రిమినల్స్ ఏదో ఒక కొత్త పద్ధతిలో అనుమానం రాకుండా, స్మార్ట్‌గా మోసం చేసేస్తున్నారు. చివరికి మోసపోయాకగానీ సైబర్ నేరగాళ్ల చేతిలో బలయ్యామని తెలుసుకోలేకపోతున్నారు. ఇటీవల నేరస్తులు "కాల్ మర్జింగ్ స్కాం" పేరుతో కొత్త పద్ధతులకు తెరతీశారు.

కాల్ మర్జింగ్ స్కాం

'కాల్ మర్జింగ్ స్కాం' అంటే! ఒక సోషల్ ఇంజనీరింగ్ మోసం. ఇది నేరస్తులు వాడే ఒక ట్రిక్. ఇందులో స్కామర్, మీకు తెలిసిన వ్యక్తి, బ్యాంక్ అధికారిగా నటిస్తూ, మీతో కలిసి ఒక కాన్ఫరెన్స్ కాల్ చేయమని చెప్పి, ముందస్తు ప్రణాళిక ప్రకారం. బ్యాంక్ ట్రాన్సాక్షన్ సమయంలో వచ్చే ఓటీపీని అడిగి తెలుసుకొని, మీ ఖాతా నుండి డబ్బు దోచుకుంటాడు. ఇందులో స్కామర్, మీ కాల్‌ను బ్యాంక్ ఆటోమేటెడ్ మెసేజ్‌తో కలిపి, మీ నమ్మకాన్ని దుర్వినియోగం చేస్తాడు.

ఎలా పనిచేస్తుంది?

మొదటి సంప్రదింపు: ఒక తెలియని వ్యక్తి మీకు కాల్ చేసి మీ ఫ్రెండ్ నుంచి నెంబర్ తీసుకున్నానని చెబుతాడు. లేదా బ్యాంక్ అధికారిగా నటిస్తాడు. "మర్జ్" చేయమని అడగడం: అదే టైమ్‌లో మీ ఫ్రెండ్ కూడా వేరే నెంబర్ నుంచి కాల్ చేస్తున్నాడని చెప్పి ఇద్దరి కాల్స్‌ను మెర్జ్ చేయమని అడుగుతాడు. లేదా అది బ్యాంక్ లైన్ అంటూ మిమ్మల్ని నమ్మిస్తారు. ఇది వెరిఫికేషన్, సెక్యూరిటీ కోసమని చెబుతారు. మీరు ఇది నిజమేనని "కాల్ మెర్జ్" చేస్తే.. ఇక మీ పని ఖతమే.

ఓటీపీ పంపడం: మీరు కాల్ మెర్జ్ చేసిన వెంటనే, స్కామర్ ప్రారంభించిన ట్రాన్సాక్షన్ కోసం బ్యాంక్ మీ మొబైల్‌కు ఓటీపీ పంపుతుంది. ఇలా చేయగానే సైబర్ నేరగాళు బ్యాంక్ ధ్రువీకరణకు అవసరమైన ఓటీపీ కాల్‌తో కనెక్ట్ అవుతారు. స్కామర్ మీపై ఒత్తిడి చేసి ఆ ఓటీపీని జోరుగా చదవమని అంటాడు. మీరు ఓటీపీ చెప్పగానే, ఆ ఓటీపీతో స్కామర్ ట్రాన్సాక్షన్‌ను పూర్తి చేసి మీ డబ్బును దోచుకుంటాడు. ఆ తర్వాత బ్యాంక్ కాల్ నుంచి వచ్చే ఓటీపీని సేకరించి మీ అకౌంట్లోని డబ్బులు కాజేస్తారు. ఈ మోసానికి వైరస్, యాప్ హాక్ అవసరం లేదు. మీ నమ్మకాన్ని తప్పుదోవ పట్టించడం(ట్రిక్ చేయడం) మాత్రమే చేయాలి.

ఫోన్ ఫీచర్ దుర్వినియోగం: సాధారణ కాన్ఫరెన్స్ కాల్ ఫీచర్‌ను నమ్మకంగా కనిపించేలా ఉపయోగిస్తారు.

రిటైర్ టీచర్‌కు అజ్ఞాత కాల్

ఈనెల ఆరో తేదీ గుర్తు తెలియని నంబర్ నుంచి తిరుపతిలోని ఓ రిటైర్ టీచర్‌కు ఫోన్ వచ్చింది. ఫోన్‌లో వ్యక్తి గంభీరంగా 'మీ ఫోన్ నంబర్ ఉపయోగించి బెంగుళూరులో మహిళలకు అనుచిత మెసేజ్‌లు పంపారు. మీపై ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. వెంటనే బెంగుళూరుకు వచ్చి కంప్లైంట్ ఇవ్వాలి' అని భయపెట్టాడు. తర్వాత మరో నంబర్ నుంచి మేము ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేటర్ సెంటర్ నుంచి అని మీపై సిబిఐ కేసులు ఉన్నాయన్నారు. మరో వ్యక్తి తాను సిబిఐ ఆఫీసర్ అని, ఆధార్ కార్డు అమ్మేఆరని, మీ అకౌంట్లు ఓపెన్ చేశారని, మూడు కోట్లకు పైగా ట్రాన్సాక్షన్ జరిగాయన్నారు. ఇలా ఫోన్ల ద్వారా అతనిని మానసికంగా కుంగదీశారు. చివరకు మీరు నిర్దోషి అని నిరూపించుకోవాలంటే 8 లక్షలు డిపాజిట్ చేయాలన్నారు. అనుమానం వచ్చిన ఆ వ్యక్తి సోమవారం తిరుపతి సైబర్‌క్రైం ఆఫీసుకు వెళ్లి వివరాలు చెప్పగా నకిలీ సైబర్ మోసం అని పోలీసులు తెలిపారు. దీంతో మూడు రోజులుగా పడిన టెన్షన్ మొత్తం మాయమయ్యింది. ఏదైనా అనుమానం వస్తే 1930కి కాల్ చేసి చెప్పాలని పోలీసులు సూచించారు.

ఎలా రక్షించుకోవాలి..?

- ఓటీపీ ఎప్పుడూ చెప్పొద్దు.
- బ్యాంకులు, ప్రభుత్వ సేవలు ఫోన్‌లో ఓటీపీ అడగవు.
- సందేహం ఉంటే ఫోన్ పెట్టేయండి:
- ఓటీపీ, పిన్, కోడ్ చెప్పమని ఒత్తిడి చేస్తే వెంటనే కాల్ డిస్కనెక్ట్ చేయండి.

స్వయంగా చెక్ చేయండి

- ఓటీపీ ఎవరితోనూ పంచుకోకూడదు.
- మీకు అనుమానం వస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.
- బ్యాంక్ ప్రతినిధులను సంప్రదించాలి.
- దీని వల్ల మీ డబ్బులు వెంటనే తిరిగి పొందే అవకాశం ఉంటుంది.
- సందేహం ఉంటే బ్యాంక్ అధికారిక నంబర్‌కి మీరు స్వయంగా కాల్ చేయండి.
- మోసపోయాక బాధితులు పోలీసులను ఆశ్రయిస్తుండగా అప్పటికీ లాభం లేకుండా పోతోంది.
- నేరం జరిగాక వెంటనే గోల్డెన్ అవర్స్‌లో పోలీసులను ఆశ్రయిస్తే లాభం ఉంటుందని, డబ్బులు తిరిగి రాబట్టుకోవచ్చు.



సహకార సంఘం ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలి


వినతి పత్రం ఇస్తున్న సహకార సంఘం ఉద్యోగులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సహకార సంఘంలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ప్రభుత్వ ఉద్యోగులకు అమలు అయ్యే రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం ఉద్యోగులు డిమాండ్ చేశారు. సహకార సంఘం ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఆందోళనలో భాగంగా, సోమవారం పుత్తూరు సహకార సంఘం బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కోటిరెడ్డి మాట్లాడుతూ జీవో నెంబర్ 36 వెంటనే అమలు పరచాలని, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలు చేసి, మధ్యంతర భృతి ఇవ్వాలని, ఉద్యోగులకు ఐదు లక్షలకు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా, ఉద్యోగ సర్వీసులో మరణిస్తే 20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీ చేయించి కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు. 2019 తర్వాత జాయిన్ అయిన ఉద్యోగులను పర్మినెంట్ చేసి వారికి కూడా హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిన్న, విజయ్, టీ.చెంగయ్య, వేణు, కన్నప్ప రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వెంకట లోకేష్‌కు ఆర్చరీలో సిల్వర్ మెడల్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణానికి చెందిన వెంకట లోకేష్ సబ్ జూనియర్ జాతీయస్థాయి ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా లయోలా కాలేజీ కరస్పాండెంట్ పంట శ్రీనివాసులు రెడ్డి లోకేషును సన్మానించి అభినందనలు తెలిపారు. లోకేష్ లయోలా కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. నవంబర్ 22 నుండి 30వ తేదీ వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్ షిప్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. కళాశాల కరస్పాండెంట్ పంట శ్రీనివాసులు రెడ్డి వెంకట లోకేష్‌ను, కోచ్ శివశంకర్‌ను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా నారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధనపాల్ ప్రమాణ స్వీకారం


ధనపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విజయవాడ, బీసీ కార్పొరేషన్ భవనంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నగరి నియోజకవర్గం పుత్తూరుకు చెందిన ఎస్.ఎన్ ధనపాల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు పట్టణ నాయకులు జీవరత్నం నాయుడు, కరుణాకరన్, బాబు నాయుడు, ఆనంద్, బిఆర్ మురళి, బిఎస్ హరి, ధనంజయ నాయుడు, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఏడు గంగమ్మల జాతర నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో ఈనెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి, నాయుడుపేట వైపు నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోకి ప్రవేశించే భారీ వాహనాలు బైపాస్ రోడ్డు నుంచి టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న నంది సర్కిల్, అక్కడ నుంచి ఎంజీఎం ఆస్పత్రి మీదుగా పట్టణంలోకి అనుమతిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ పరిధి నుంచి వెలుపలకు వెళ్ళాల్సిన భారీ వాహనాలు ఎంజీఎం ఆస్పత్రి మీదుగా నంది సర్కిల్ వరకు, అక్కడ నుంచి బైపాస్ గుండా తిరుపతి, నాయుడుపేట మార్గాలకు వెళ్ళాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఆంక్షలకు వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జీవో 36ను తక్షణం అమలు చేయండి


డిసిసి బ్యాంకు మేనేజర్‌కు సహకార సంఘాల ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జీవో నెంబర్ 36ను తక్షణమే అమలు చేయాలని సహకార సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక డిసిసి బ్యాంకు కార్యాలయం వద్ద సోమవారం వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు నిరసన తెలిపారు. తిరుపతి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి. చిరంజీవి రెడ్డి మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి జీవో నెంబర్ 36 అమలుపరచకపోవడంతో ఉద్యోగులు తమ హక్కులను కోల్పోతున్నారని వాపోయారు. ఆరోగ్య బీమా, ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వేతనాల సవరింపు ఇతరత్రా న్యాయపరమైన సమస్యలు దీర్ఘకాలికంగా పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట పట్టణంలోని పెసల గుర్రప్ప శెట్టి జూనియర్ కళాశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ బాలికల వసతి గృహానికి నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.కె రఫీ 15,000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థినిల విన్నపాల మేరకు కాలేజీ రావడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థినులకు కాలేజీకి సమీపంలో వసతి గృహం ఏర్పాటు చేయాలని కళాశాల ప్రిన్సిపల్ సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి గత నెలలో విన్నవించారు. దీనిపై స్పందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.కె.రఫీ ఆయన నడుపుతున్న 786 సేవా సంస్థ ద్వారా బాలికల వసతి గృహం ఏర్పాటుకు సూళ్లూరుపేట టిడిపి ఇంచార్జ్ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో కాలేజీ ప్రిన్సిపల్ హనుమంతరావుకు 15 వేల రూపాయల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు షైలా.రాజశేఖర్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్ ఫజలుల్లాకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు తిరుపతి జిల్లా కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య

ప్రజాశక్తి - నాయుడుపేట: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయుడుపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై నాయుడుపేట మునిసిపల్ కమిషనర్ ఎస్.కె ఫజలుల్లాను కలిసి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ సిబ్బందికి మూడు నెలల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. నాన్ ఆప్కాస్ వారికి నాలుగు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్ బట్టలు, చెప్పులు, నూనెలు, సబ్బులు, టవల్స్, పనిముట్లు, గ్లౌజులు, సేఫ్టీ పరికరాలు తదితర సామాగ్రి ఇవ్వాలని కోరారు. గత జులైలో సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో ప్రభుత్వం జీతాలు పెంచిందని గుర్తు చేశారు. సదరు సమ్మె కాలానికి వేతనం ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె తర్వాత కుదిరిన ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ మంజూరు చేయాలన్నారు. ఎక్స్‌గ్రేషియా పెంపుపై జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ వినతిపై కమిషనర్ స్పందిస్తూ తమ పరిధిలో ఉన్న సమస్యల గురించి ప్రభుత్వానికి లేఖ రాస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయుడుపేట మండల కార్యదర్శి శివకవి ముకుందా, మున్సిపల్ యూనియన్ నాయకులు కె.రమణమ్మ, అంకయ్య, మల్లికార్జున్, నెలవల.సుబ్రహ్మణ్యం, ఆరావళి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత, కనీస వేతనం కల్పించాలి


జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ నాయుడు, మండల విద్యాశాఖ అధికారి మునిరత్నంలకు వినతి పత్రం ఇస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ప్రజాశక్తి - నాయుడుపేట: మధ్యాహ్న భోజనం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కార్యదర్శి కే.విజయమ్మ కోరారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై సోమవారం నాయుడుపేట మండల విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ అధికారి చంద్రశేఖర్ నాయుడుకు, మండల విద్యాశాఖ అధికారి మునిరత్నంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని, స్మార్ట్ కిచెన్‌లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ కార్మికుల పోరాటాలు చేపడితేనే ప్రభుత్వాలు, నాయకులు దిగివచ్చి సమస్యలు పరిష్కారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం జిల్లా కమిటీ సభ్యులు వాణి, మీనమ్మ, రజియా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనే టీచ్ టూల్ లక్ష్యం


శిక్షణ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎంఈఓ-2 బాలయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మెరుగైన విద్యా బోధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ టీచ్ టూల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని శ్రీకాళహస్తి ఎంఈఓ-2 బాలయ్య పేర్కొన్నారు. స్థానిక బాబుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్ గా వ్యవహరించిన బాలయ్య మాట్లాడుతూ ఈ టీచ్ టూల్ శిక్షణ ద్వారా కేంద్రిత బోధన పద్ధతులు, పిల్లల్లో పునశ్చరణ వంటి అంశాలు ఉపయోగకరమన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉపాధ్యాయులు పాఠశాలల్లో విధిగా టీచ్ టూల్ అబ్జర్వేషన్ చేయాలని, బోధనను మెరుగుపరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తీగల వెంకయ్య, రిసోర్స్ పర్సన్లు గోపి, పవన్, సురేష్, బాబు, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బిఎన్ కండ్రిగ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరుగుతున్న రిఫ్రెష్‌మెంట్ 'టీచ్ టూల్' శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని గ్రామీణాభివృద్ధి అధికారి, ఓ పుష్పలత, సమాచార సాంకేతిక విభాగం అధికారి డి.శిల్ప పర్యవేక్షించారు. ఈ శిక్షణ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాథ్, కోర్సు సంచాలకులు ముని సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య పర్యవేక్షణలో జరిగింది. ఈ శిక్షణలో బిఎన్ కండ్రిగ, తొట్టంబేడు, వరదయ్యపాళెం మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు స్కూల్ వనరుల సమన్వయకర్తలు మొత్తం 54 మంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కోట: ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంఈఓ దారా మస్తానయ్య తెలిపారు. కోట పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఏవిధంగా మూల్యాంకనం చేస్తామో, ఆదేవిధంగా టీచ్ టూల్ అనేది ఉపాధ్యాయుల బోధన పద్ధతులను సక్రమంగా అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. బోధనా సామర్థ్యాన్ని మెరుగుపరచుకొనుటకు టీచ్ టూల్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల 58 మంది ఆబ్జర్వర్లకు మాస్టర్ ట్రైనింగ్ నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏపిఎమ్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, జీవి జడ్పీఎస్ ప్రధానోపాధ్యాయులు సుమన, జగదీష్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, సీఎంఆర్టీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు సీఎంఆర్టీలు పాల్గొన్నారు.

పాడి రైతులకు సబ్సిడీపై గడ్డి కత్తిరించే యంత్రాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: ప్రభుత్వం చంద్రగిరి మండలంలోని పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో గడ్డి కత్తిరించే యంత్రం అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె.వాణీ తెలిపారు. ఈ యంత్రం విలువ రూ.40,500 కాగా, రైతులకు రూ. 20,250కు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో అనిమల్ హస్బెండ్రీ అసిస్టెంట్లను లేదా సమీప పశువైద్యశాల సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

పేదల సంక్షేమం సామాజిక న్యాయమే 'వందేమాతరం'

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పేదల సంక్షేమం, సామాజిక న్యాయమే నిజమైన 'వందేమాతరం' అని పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. వందేమాతరం గీతం 150 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని పార్లమెంట్‌లో జరిగిన ప్రత్యేక చర్చలో వైసీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రసంగించారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఈ భావజాలానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఎంపీ గురుమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తూ పేద విద్యార్థుల డాక్టర్ల కలను దూరం చేస్తున్నారని ఆరోపించారు. రైతుకు కనీస మద్దతు ధర దక్కడం లేదన్నారు. విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసుపత్రుల పాలవుతున్నారని, తిరుపతి సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపుల ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

ఇంటి పట్టాలకు స్థలాలు చూపించండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ నివాసితులకు, గత ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాలకు స్థలాలు చూపించాలని సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం వేదాంతపురం పంచాయతీ, రాంనగర్ కాలనీల్లో ఇళ్ల లేని నిరుపేదలతో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణ వాసులకు 2 సెంట్లు, రూరల్ నివాసితులకు 3 సెంట్లు భూమి కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. పేదల పట్ల నిర్లక్ష్యం వహిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. కలెక్టర్ జోక్యం చేసుకొని పట్టాలకు ఇంటి జాగాలు చూపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌కు వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ తిరుపతి ఆర్డీఓ, కాళహస్తి ఆర్డీఓతో మాట్లాడి 15 రోజులలో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు కే పద్మనాభరెడ్డి, వేదాంతపురం శాఖ కార్యదర్శి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎస్పీడబ్ల్యూ విద్యార్థినులు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు నవంబర్ 29 నుండి 30వ తేదీ వరకు కాకినాడలోని డీఎస్ఏ స్టేడియంలో జరిగిన అండర్ 19 జిమ్నాస్టిక్స్ పోటీలలో సత్తా చాటారు. జాతీయ స్థాయికి ఎన్నికై కలకత్తాలో జనవరి 2026- 14 నుంచి 17 వరకు జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని, రాష్ట్రస్థాయిలో వివిధ పతకాలను కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయికి ఎన్నిక కావడం రాష్ట్రానికి, టిటిడి సంస్థకు గర్వకారణమన్నారు. ఫిజికల్ డైరెక్టర్ శ్రావణిని అభినందించారు. వివిధ విభాగాల్లో ఎస్ ధరణి, రిథమిక్ గోల్డ్, సిల్వర్, బ్రాంజ్, వై.గంగా భవాని, రిథమిక్ గోల్డ్, వై.రెడ్డి జీవన, ఆర్టో బాటిక్స్ సిల్వర్, ఎస్. అమృత, ఆర్టో బాటిక్స్ సిల్వర్లు, జాతీయ స్థాయికి ఎంపికైన ఎస్ ధరణి- ద్వి.సం. హెచ్ఈసి, వై.గంగా భవాని- తృతీయ సంవత్సరం బైపిసి, డి.చైతన్యశ్రీ, సిఈసి, ఎమ్.యామిని, ప్రథమ సంవత్సరం బైపిసి విద్యార్థినులు ఎంపికయ్యారు.

12న ధర్నాను జయప్రదం చేయండి


డీఏఓ శిరీషకు సిఐటియు నాయకుల వినతి పత్రం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : 12వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ఏ.పీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో జరుగనున్న ధర్నాను జయప్రదం చేయాలని గూడూరు అంగన్వాడి అధ్యక్ష, కార్యదర్శులు ఏ.ఇంద్రావతి, బి.ఎస్. ప్రభావతిలు పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీల వేతనాలు పెంచాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మార్చిన సెంటర్లకు పెరిగిన వేతనాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేల రూపాయలు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 1810 మినీవర్కర్స్‌కు క్వాలిఫికేషన్ రిలాక్స్ షన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, హెల్పర్ల ప్రమోషనల్‌కు నిర్దిష్టమైన గైడ్ లైన్స్ రూపొందించి అమలు చేయాలని, అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, అన్ని యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చాలని, సెంటర్ నిర్వహణకు 5 జి ఫోన్లు ఇవ్వాలని, ఎఫ్.ఆర్.ఎస్ రద్దు చేయాలి, గ్రాడ్యుటి అమలుకు గైడ్ లైన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్ట్‌లు వెంటనే భర్తీ చేయాలని, లబ్ధిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాలిటీ పెంచాలని, మెనూ ఛార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, ఐదు సంవత్సరాలు లోపు పిల్లలందరూ అంగన్వాడీ సెంటర్లో ఉండాలని జీ.వో జారీ చేయాలని, పలు డిమాండ్లపై సోమవారం గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డి.ఏ.ఓ శిరీషకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సెక్టార్ లీడర్లు ఇ.పెంచలమ్మ, జె.లక్ష్మి, ఎస్.కె.ఆసియా బేగం, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి. శివకుమార్, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంగన్వాడి సమస్యలు పరిష్కారానికి, ఈనెల 12న కలెక్టరేట్ వద్ద నిర్వహించన్ను ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం పుత్తూరు, ఐసిడిఎస్ కార్యాలయంలో ఇన్చార్జి సిడిపిఓ సంధ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడివ వర్కర్స్ అధ్యక్ష కార్యదర్శులు విజయ్ కుమారి, ముని కుమారి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి నో హెల్మెట్.. నో పెట్రోల్

ప్రజాశక్తి - రామచంద్రాపురం : ద్విచక్రవాహన చోదకులందరూ మోటారు వాహనాల చట్టం ప్రకారం తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని ఎస్సై భక్తవత్సలం కోరారు. సోమవారం ఆర్ సి పురం రక్షక భట్ట నిలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు అతి వేగంగా వాహనాలను నడపరాదని, పరిమితమైన వేగంతోనే వాహనాలు నడపాలని హెచ్చరించారు. 15వ తేదీ నుండి వాహన చోదకుడు, వెనకాల కూర్చుని ప్రయాణించే వ్యక్తి కూడా హెల్మెట్ ధరిస్తేనే పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ నింపుతారని, హెల్మెట్ లేకపోతే పెట్రోల్ పట్టరని ఆయన తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ తనిఖీలలో పట్టుబడితే రూ 10 వేలు జరిమానాలు విధిస్తామన్నారు. వాహనాలు నడిపేవారు డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, రాష్ డ్రైవింగ్ చేసినా రూ.5 వేల రూపాయలు జరిమానా విధించడంతోపాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించరాదని, విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే వెంటనే ఆర్ సి పురం ఎస్సై 9440796731 ఫోన్ నెంబర్ కు ఫిర్యాదు చేయాలన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల ఎస్ఐ హరిప్రసాద్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకపోతే పెట్రోల్ బంకుల్లో కూడా పెట్రోలు పట్టకుండా జీవో రిలీజ్ చేయడం జరిగిందని తెలిపారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

హెల్మెట్ లేకుంటే ప్రయాణం లేదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వన్ టౌన్ సీఐ ప్రకాష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం పట్టణ వ్యాప్తంగా హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకులు, స్కూళ్ల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసి నో హెల్మెట్, నో ఫ్యూయల్ నో హెల్మెట్ -నో ఎంట్రీ అంటూ స్పష్టం చేశారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారి ప్రయాణాలను అడ్డుకుంటామని హెచ్చరించారు.

శిరస్త్రాణం ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - నాయుడుపేట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని నాయుడుపేట పట్టణ సీఐ బాబి పేర్కొన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు ఆదేశాల మేరకు సోమవారం నాయుడుపేట మండలం, మేనకూరు సెజ్ ప్రాంతంలో వెంకటగిరి నాయుడుపేట మధ్య తిరుగుతున్న సుమారు 200 మంది ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. 70 మంది ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్లు కొనుగోలు చేయించి, ధరింపజేశారు. ప్రాణ రక్షణ పొందాలన్నా, జరిమానాలు విధించకుండా ఉండాలన్న తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. సీఐ ఎమ్.బాబీ వెంట నాయుడుపేట పట్టణ ఎస్ఐ ఆదిలక్ష్మి,పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఒక నెల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు పోలీసుల అధికారులు తెలిపారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు వాహన చోదకులు పాటించాలని ప్రసాద్ తెలిపారు. హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం, మైనర్లు వాహనాలు నడపడం వంటివి ప్రమాదాలకు కారణమని సిఐ సురేష్ కుమార్ హెచ్చరించారు.

రహదారి కూడళ్లను పరిశీలించిన డిఎస్పి చెంచుబాబు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండంతో నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు సోమవారం రహదారిపై ఉన్న కూడళ్లను పరిశీలించారు. మండలంలోని నెల్లబల్లి, దొరవారిసత్రం, వెదురుపట్టు, మావాళ్లపాడు గ్రామాల వద్ద జాతీయ రహదారి కూడళ్లలో తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈప్రమాదలను అరికట్టేందుకు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, ఎన్ఎహెచ్ఐ అధికారుకు అయన సూచించారు. వీరివెంట ఎస్ఐ అజయ్ కుమార్, ఎన్ హెచ్ ఐ అధికారులు ఉన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సేవా శిబిరాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని, పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ సహకారంతో గ్రామాల్లో సేవా శిబిరాలు నిర్వహించారు. సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామాలల్లో శిబిరాలు నిర్వహించి సేవ చేస్తున్నారని తెలిపారు. బాల్యవివాహాలపై, పరిసరాల పరిశుభ్రపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సాగర్ రెడ్డి, పిడి మౌలాలి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

శానంభట్లలో ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్, చంద్రగిరి : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-22, 17ల ఆధ్వర్యంలో బ్రాహ్మణపట్టు, శానంభట్ల గ్రామాలలో ప్రత్యేక అవగాహనా శిబిరాన్ని కోఆర్డినేటర్లు సోమవారం ప్రారంభించారు. గ్రామంలో శుభ్రత, ఆరోగ్య అవగాహన, విద్య, పర్యావరణ సంరక్షణ వంటి అంశాలపై వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు వాలంటీర్లు ముందుకు వచ్చారు. ఈ ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామ ప్రజల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఐ.వి. లలిత కుమారి, హోం సైన్స్ విభాగాధిపతి డాక్టర్ వి.బిందు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆర్.భారతి, ఎస్. తులసి, శాంతి, హరిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

నీటి గుంటలో దిగి యువకుడు మృతి


ఈశ్వరయ్య (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - వాకాడు : వాకాడు మండలం, గొల్లపాలెం గ్రామానికి చెందిన ఇన్నమాల ఈశ్వరయ్య (35) నీటి గుంటలో దిగి గల్లంతయ్యి మృతి చెందాడు. టిడిపి నాయకులు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి సహకారంతో ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల ద్వారా మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు.

చెరువులో గుర్తు తెలియని మృతదేహం



ప్రజాశక్తి - ఓజిలి: తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, రాచపాలెం గ్రామ చెరువులో గుర్తు తెలియని సుమారు 35 నుండి 45 సంవత్సరాల వయసుగల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వారు తెలిపిన వివరాల మేరకు మృతుడు సిమెంట్ కలర్ టి-షర్ట్, నలుపు రంగు ప్యాంటు దరించి ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సదరు వ్యక్తి ఆచూకి ఎవరైనా గుర్తిస్తే సమాచారం అందించాలని తెలిపారు.

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని అలిమిలి గ్రామానికి చెందిన పొట్టేళ్ల శీనయ్య, వెంకటరమణమ్మ ల కుమారుడు పొట్టేళ్ల ప్రసన్న కుమార్ (32)అనే వ్యక్తి గత నెల 30 నుండి కనిపించడం లేదని బాలాయపల్లి శీనయ్య పోలీసులకు పిర్యాదు చేసిన విషయం తెలిదిందే. శీనయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అరా తీయగా ఈతకు వెళ్లి కైవల్యా నది లో కొట్టుకు పోయాడని తేలింది. సోమవారం నిండలి సమీపంలో ని కైవల్యా నది లో మృతదేహం ఉందన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీంచగా ప్రసన్న కుమార్ మృత దేహం గా గుర్తించారు. మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం వేంకటగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విత్తనాల నూతన చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సీడ్స్ బిల్ 2025-ఫెడరల్ హక్కులను అణగదొక్కే, ఆహార భద్రత, విత్తన స్వావలంబనను నాశనం చేసే కొత్త చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని బుచ్చినాయుడు కండ్రిగ మండలం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ధనంజయులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా గ్రామాలలో సీడ్స్ బిల్ 2025 ముసాయిదా ప్రతులను దహనం చేయాలని పిలుపునిచ్చారు. విత్తన నాణ్యత నియంత్రణను ఆధునీకరిస్తూ పాత సీడ్స్ యాక్ట్ స్థానంలో కొత్త చట్టం తీసుకురావడానికి వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సీడ్స్ బిల్ 2025 ముసాయిదాను ప్రవేశ పెట్టిందని తెలిపారు. విత్తన రంగంపై బహుళజాతి సంస్థల కార్పొరేట్ ఆధిపత్యాన్ని సంయుక్త కిసాన్ మోర్చా వ్యతిరేకించిందన్నారు. ఈ చట్టం ఆహార భద్రత, విత్త స్వావలంబనను దెబ్బదీస్తుందని, కావున వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బుర్ర సుబ్రహ్మణ్యం, చిన్నయ్య, వెంకటయ్య, గణేష్, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు

పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తడుకు గ్రామపంచాయతీ పరిధి, వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి వేణుగోపాల పురం మాజీ ఎంపీటీసీ దేశమ్మ, ఆదిమందడి 5016 రూపాయలు విరాళంగా అందించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వి.త్రివేణి, వైస్ చైర్మన్ బి.లావణ్య, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటేష్, ఉపాధ్యాయులు జి.స్వప్న పాల్గొన్నారు. దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : బీసీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని అమరావతి, టీడీపీ జాతీయ కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రోజుకు 150 రూపాయలకు, కాస్మోటిక్ చార్జీలు నెలకు 500 రూపాయలుకు పెంచాలని, రాష్ట్రంలో అన్ని బీసీ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు కేటాయించాలని వినతిలో కోరినట్లు తెలిపారు. బీసీ లేడీస్ హాస్టల్స్‌లో ఖాళీలు భర్తీ చేయమని కోరామని తెలిపారు. కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో బీసీ విద్యార్థులకు కూడా ఫీజు సడలింపు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత విద్య కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి గున్నయ్య మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతుల జీవన ఉన్నతికి అంగవైకల్యం అడ్డుకాదన్నారు. మండలంలోని భవిత కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేక విద్య అందిస్తూ వారికి అవసరమైన వివిధ పరికరాలను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట నాయుడు, సహిత విద్య ఉపాధ్యాయులు గణేష్, సుకన్య ఉపాధ్యాయులు గురప్ప సురేఖ, సుగుణ, అప్పారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సహకరిద్దాం

ప్రజాశక్తి - సత్యవేడు: సమాజంలోని ప్రతి ఒక్కరు దివ్యాంగులకు సహకరించాల్సిన అవసరం ఉందని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సోమవారం మండల పరిధిలోని నరసరావు అగ్రహారం పాఠశాలలో ఎంఈఓ రవి అధ్యక్షతన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ2 ఉష, ఫిజియోథెరపిస్టు విజయ్ కుమార్, పాఠశాల హెచ్ఎం సురేష్, ఐఈఆర్టీలు దివ్యకుమారి, వెంకటరత్నం, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం : ప్రత్యేక ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు కోరారు. సోమవారం మిట్టూరు భవిత స్కూల్‌లో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు మార్కండేయనాయుడు, జయవేలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. భవిత సెంటర్లోని ప్రత్యేక ప్రతిభావంతులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ లు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పిలు మనోహర్, రాజేశ్వరి, లీలారాణి, ప్రత్యేక ప్రతిభావంతులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.